ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాల కూల్చివేత

పెద్దఅంబర్‌పేట, మే 15: పెద్దఅంబర్‌పేటలోని ఈదుల చెరువులో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈదుల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాలను బుధవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సహకారంతో ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు. చెరువుల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేదిలేదని హెచ్చరించారు. కూల్చివేతల సమయంలో డీఈ ఉషారాణి, ఇరిగేషన్ ఏఈ తస్వీన్ రాజా, మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టి, చెరువులో మట్టి నింపిన వారిపై హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

నీటితొట్లకు మరమ్మతులు

నీళ్లు నింపిన అధికారులు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

యాచారం, మే15: 'నీటితొట్లు వెలవెల.. పశువులు విలవిల' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో బుధవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మండలంలోని కుర్మిద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి ఎంపీడీవో నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో ఎన్నో ఏండ్లుగా నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను శుభ్రం చేయించి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. శిథిలావస్థకు చేరిన నీటితొట్లకు మరమ్మత్తులు చేయించిన పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా నీటిని నింపారు. దీంతో రైతులు, జీవాల పెంపకందారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పశువుల నీటితొట్లను ఉపయోగంలోకి తీసుకొచ్చి రైతులకు మేలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నీటితొట్ల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి వివరించారు.

నీటితొట్లకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

ట్యాంకర్‌తో నీటితొట్టిలో నీరు నింపుతున్న దృశ్యం

ప్రెస్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం

ఆమనగల్లు, మే15 : మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హమీద్‌ను కార్యవర్గ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాల మధ్య వారధిగా పనిచేస్తూ అనునిత్యం ప్రజాసమస్యలను వెలికితీసి పరిష్కరించడంలో కీలక భూమిక పోషిస్తున్న జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివని వారు అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమార్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సుభాశ్, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు సయ్యద్ ఖలీల్, నాయకులు కోట శ్రీను, సైదుల్ గౌడ్, సతీశ్, మహేందర్ ఉన్నారు.

పాలమూరు యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్‌గా శ్రీను

యాచారం, మే15: మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన మోటె శ్రీను పాలమూరు యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ (పీహెచ్‌డీ)గా ఎంపికయ్యాడు. ఫిజికల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్‌లో ఆరో ర్యాంకు సాధించారు. మారుమూల గ్రామానికి చెందిన శ్రీనివాస్ నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకొని పీహెచ్‌డీకి ఎంపికవడంతో గ్రామస్తులు అభినందిస్తున్నారు. పీహెచ్‌డీలో శ్రీను చేసే పరిశోధనలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకం కావాలని పలువురు ప్రశంసలతో కొనియాడారు.

తాటి ముంజలు కోస్తూ.. జారిపడి గీత కార్మికుడి మృతి

తేజ (ఫైల్)

పెద్దఅంబర్‌పేట, మే 15: తాటి కల్లుతోపాటు తాటి ముంజలు కోస్తూ చెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మజీద్‌పూర్ గ్రామానికి చెందిన గండేటి తేజ (50) గీత కార్మికుడు. భార్య సంతోషతో కలిసి బాటసింగారం గ్రామ శివారులో తాటి కల్లు, తాటి ముంజలు తీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

యాచారం, మే 15 : మండలంలోని మంథన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన సబావత్ గణేశ్‌నాయక్ ముస్లిం కుటుంబానికి చెందిన వధువు కుటుంబ సభ్యులకు క్వింటాల్ బియ్యం, పట్టుచీరను పెళ్లి కానుకగా కుటుంబానికి బుధవారం అందజేశారు. ఆయన వెంట వెంకటయ్య, బిక్కు, ప్రసాద్, సర్ధార్, లోకేశ్, శ్రీకాంత్, చరణ్, కిరణ్, రాహుల్, బన్నీ తదితరులున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, మే 15 : నందిగామ మండలం చేగూరు శివారులో ఏర్పాటు చేస్తున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. సబ్‌స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించారు. గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యలు రాకుండా వ్యవసాయ, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు నర్సింహ, కుమారస్వామిగౌడ్, కృష్ణయాదవ్, వీరేందర్‌గౌడ్, బుచ్చయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఫాతిమా మాత ఉత్సవాలు

కొత్తూరు, మే 14: మండల పరిధిలోని ఫాతిమాపూర్‌లో ఫాతిమా మాత ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫాతిమా మాత తిరునాళ్ల మహోత్సవాన్ని చూడటానికి క్రిష్టియన్లు పెద్ద ఎత్తున తరలి రావడం విశేషమని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు విజయపాల్‌రెడ్డి, నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కృష్ణ, మహేశ్‌గౌడ్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 15 : అబ్దుల్లాపూర్‌మెట్ జాతీయ రహదారిపై వాహనాలు సామర్థ్యానికి మించి లోడ్‌తో ప్రయాణం చేయడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడ్‌లతో వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు వాహన దారులు కోరుతున్నారు.

అధికలోడ్‌తో ప్రమాదకరంగా వెళుతున్న వాహనం

ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు దేరంగుల వెంకటేశ్ జన్మదిన వేడుకలు బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరయ్యారు. - ఆమనగల్లు, మే15

ప్రభుత్వ కళాశాలలో చేరండి

మంచాల, మే 15: ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య అన్నారు. బుధవారం మంచాల మండలం తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఆరుట్ల, మంచాల గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు ఇంటింటా తిరుగుతూ కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థి కళాశాలలో చేరాలని వారిన కోరారు. ప్రైవేటు కళాశాలలో విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేయడమే పనిగా పెట్టుకుంటారని, ప్రభుత్వ కళాశాలలో ఎలాంటి ఫీజులు లేకుండా బోధన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

విద్యా శాఖ మండల అధికారులకు ఫిర్యాదు చేసిన శివశౌర్యన్ తండ్రి విక్రమ్

మొయినాబాద్, మే 15 : నిర్లక్ష్యంతో తన కొడుకు ప్రాణాలు తీసిన సుజాత పాఠశాల యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతుడు తండ్రి, గ్రామస్తులు విద్యా శాఖ అధికారులను కోరుతూ బుధవారం వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన గాండ్ల విక్రమ్ చిన్న కుమారుడు మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలోని సుజాత పాఠశాలలో యూకేజీ పూర్తి చేశాడు. కాగా పాఠశాల యాజమాన్యం సమ్మర్ క్యాంపు నిర్వహించడంతో తన కుమారుడు శివశౌర్యన్‌ను బాడ్మింటన్ కోచింగ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. రోజు మాదిరిగానే ఈ నెల 10న శివశౌర్యన్ బాడ్మింటన్ కోచింగ్‌కు వెళ్లాడు. ఆ రోజు బాడ్మింటన్ ఆడించకుండా స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లారు. చిన్న పిల్లలకు సంబంధించినది కాకుండా పెద్దవాళ్ల స్విమ్మింగ్ పూల్ కావడంతో ఎలాంటి సేఫ్టీ గార్డులు పిల్లలకు ఇవ్వలేదన్నారు. పిల్లలు స్విమ్మింగ్ చేస్తుండగా లోతు ఎక్కువగా ఉండడంతో తన కొడుకు నీట మునిగి మృతి చెందినట్లు తెలిపారు. యాజమాన్యంతో పాటు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి చంద్రశేఖర్, స్విమ్మింగ్ కోచ్ తన కుమారుడి మరణానికి కారణం అని అధికారులకు తండ్రి వివరించాడు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పూడిక తీత

ఐటీ కారిడార్‌లో ఖాజాగూడ చెరువుకు వేసవి కావడంతో దాదాపుగా నీళ్లన్నీ ఎండిపోయి వట్టిపోయి దర్శనమిస్తున్నది. ఈ నేపథ్యంలోనే అధికారులు జేసీబీలతో చెరువులో పూడిక తీత పనులు చేపట్టారు

బస్తీ దవాఖానల్లో సాంకేతిక సమస్యలు

- ఎక్విప్‌మెంట్ బ్రేక్‌డౌన్ కారణంగా పరీక్షలకు రెండు రోజులపాటు అంతరాయం
- సేవలు పునరుద్ధరించినట్లు వెల్లడించిన తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ అధికారులు

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో ఉన్న కొన్ని బస్తీ దవాఖానలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఏరియా దవాఖానల్లో నిర్వహించే బీ12, డీ3 పరీక్షలతోపాటు మరికొన్ని ప్రస్తుతం చేయడంలేదని రోగులు వాపోతున్నారు. డాక్టర్ల ఫీజు కంటే వైద్య పరీక్షల ఖర్చే వేలు, లక్షలు దాటుతున్నదనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద రోగులపై ఆర్థిక భారం తగ్గించే లక్ష్యంతో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్లను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్లలో 134 రకాల వైద్య పరీక్షలను బీఎఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతిరోజు ఒక్క గ్రేటర్ లోనే సుమారు 10వేలకు పైగా వివిధ రకాల వైద్య పరీక్షలను తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంట్రల్ ల్యాబ్‌లో నిర్వహించడమే కాకుండా 24 గంటల్లోనే దాదాపు అన్ని రకాల వైద్య పరీక్షలు జరిపి, నివేదికలను రోగుల సెల్‌ఫోన్‌లకే పంపేవారు. దీని వల్ల ప్రజలకు ఆర్థిక భారం తప్పేది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీటి నిర్వహణ సరిగా పట్టించుకోకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో రోగులు సేవలు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

సేవలు పునరుద్ధరించాం..

సెంట్రల్ ల్యాబ్‌లో ఎక్విప్‌మెంట్ బ్రేక్‌డౌన్ వల్ల రెండురోజుల పాటు బి12, డీ3 పరీక్షలకు అంతరాయం ఏర్పడిందని తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబ్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం సమస్య పరిష్కారం కావడంతో వెంటనే సేవలను పునరుద్ధరించడం జరిగిందని, ఇప్పుడు అన్ని సెంటర్లలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. జిల్లాల్లో అయితే 134 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో మెడికల్ కాలేజీలు ఉన్నందున అక్కడ అందుబాటులో ఉన్న సర్జికల్ ప్రొఫైల్, టీబీ, హెచ్ఐవీ వంటి కొన్ని రకాల మెడికల్ టెస్టులు మినహా 134లోని ఇతర అన్ని రకాల పరీక్షలు జరుపుతున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. – ల్యాబ్ అధికారులు

నర్సుల సేవలు వెలకట్టలేనివి..

శేరిలింగంపల్లిలో ఉత్తమ సేవలందించిన నర్సులను సన్మానిస్తున్న డాక్టర్ మధుసూదన్, తదితరులు

- డాక్టర్ మధుసూదన్

శేరిలింగంపల్లి, మే 15 : సమాజంలో నర్సుల సేవలు ఎంతో కీలకమైనవని రంగారెడ్డి జిల్లా దవాఖాన డాక్టర్ మధుసూదన్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో సేవలందిస్తున్న ఉత్తమ నర్సులను ఘనంగా సన్మానించారు. మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, రోగులకు నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. నైటింగేల్ సేవలను నర్సులు ఆదర్శంగా తీసుకొని మరిన్ని సేవలందించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ రామస్వామిమాధవ్, నర్సులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి

మాట్లాడుతున్న ప్రతినిధి వనిత వోసుదేవ్

మణికొండ, మే 15: యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణలో పోటీతత్వం పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలని ఐఐటీ ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ప్రతినిధి వనిత వోసుదేవ్ అన్నారు. గండిపేట్‌లోని మహాత్మగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన వాతావరణం, సుస్థిరత అంశంపై సమావేశం జరిగింది. సాల్వ్ ఫర్ టుమారో సెన్సిటైజషన్ సెషన్‌లో వనిత మాట్లాడుతూ.. సాంసంగ్ ఇండియా విద్యార్థుల్లోని ఆవిష్కరణల స్ఫూర్తికి వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి అరుణరాజ్, రంజిత్‌సింగ్, ముస్కాన్, వెంకట్ రెడ్డి, మాధవి, ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గల్లీ గల్లీలో గంజాయి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్

బడంగ్‌పేట, మే 15: గల్లీ గల్లీలో గంజాయి దందా జోరుగా సాగుతోందని.. గంజాయిని నిలువరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందుతోందని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గంజాయి మత్తులో యువత భవిష్యత్ చిత్తు అవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారని.. చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని ఆరోపించారు. ఏ బస్తీల్లో చూసినా పేదల పిల్లలు గంజాయి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు లేని గ్రామాలు ఉన్నాయి కానీ.. గంజాయి లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదన్నారు. పోలీసులు గంజాయిని నిలువరించడానికి ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయడం లేదన్నారు. పోలీసులకు సమాచారం వస్తే అడప దడపా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని చెప్పారు. మీర్‌పేట, బాలాపూర్, పహాడీషరీఫ్, ఆబట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయిని నిలువరించడానికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయించాలన్నారు. యువత గంజాయితో చెడు మార్గంలో పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మత్తులో ఏం చేస్తున్నారో వారికి తెలియదన్నారు. ఇకనైనా పోలీసులు గంజాయి విక్రయ దారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. యువత భవిష్యత్‌ను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

శారదధామంలో ఆచార్యులకు శిక్షణ

బండ్లగూడ, మే 15: విద్యారంగానికి అంత్యత ప్రాధాన్యత ఉన్నదని, విద్యతోనే సమాజం బాగుపడుతుందని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి అయాచితుల లక్ష్మణరావు పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశారద ధామంలో నూతన ఆచార్యులకు శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ఆచార్యులను ఉద్దేశించి మాట్లాడారు. శిశు మందిర్‌లో బోధించే ఆచార్యులు విషయ పరిజ్ఞానంతో పాటు సమగ్ర వికాసం కలిగే విధంగా యోగ, కళాత్మక అంశాలు, వ్యాయామంతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థికి భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మిణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సరస్వతి విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ నీలిమ, సరస్వతి విద్యా పీఠం తెలంగాణ అకాడమిక్ ఇన్‌చార్జి కృష్ణ మాచార్యులు, నూతన ఆచార్యులు పాల్గొన్నారు.

ఆచార్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యాభారతి దక్షిణ క్షేత్ర కార్యదర్శి లక్ష్మణరావు

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

ఇంటర్నేషనల్ నర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవెన్, సత్యసాయి ప్రసాద్

ఆర్కేపురం, మే 15 : నర్సుల సేవలు మరువలేనివని ఓజోన్ హాస్పిటల్స్ ఎండీ. బీవీ సత్యసాయి ప్రసాద్ తెలిపారు. ఇంటర్నేషనల్ నర్సడ్ డే సందర్భంగా బుధవారం ఆర్కేపురంలోని ఓజోన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్ ముఖ్యఅతిథిగా హాజరై నర్స్‌లకు సర్వైకల్ క్యాన్సర్ ప్రివెన్షన్ ఫ్రీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భాశయం ముఖద్వారానికి సంబంధించిన వ్యాధి 30ఏండ్లు పైబడ్డ వారికి వస్తుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అరికట్టవచ్చన్నారు. గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, డాక్టర్లు ఇంద్రసేనారెడ్డి, పూజిత, శ్రీనివాస్‌రావు, నర్సులు పాల్గొన్నారు.